పంపెదనని యేసు వాగ్దానము చేసెను (యోహాను 16:12, 13). క్రీస్తు ఆ వాగ్ధానమును నెరవేర్చెనని మన మెరుగుదుము. క్రొత్త నిబంధనలో అదంతయు మనకు బయలుపరచబడి యున్నది. అపొస్తలులు పరిశుద్ధాత్మని ద్వారా సంఘమును స్థాపించి, దాని నియమములను ఆత్మ ప్రేరితులై లిఖించి యిచ్చిరి. అందువలన దైవజనుని ప్రతి సత్కార్యమునకు సంపూర్ణునిగా సిద్ధపరచుటకు లేఖనములు పరిపూర్ణములు (2 తిమోతి 3:16,17).

బైబిలులో బయలు పరచబడిన సంగతులనే మనము బోధించవలెనని ఈ అబద్ధ బోధకులను హెచ్చరించ ప్రయత్నించుసరికి,వారు గొప్ప గందరగోళమును లేవనెత్తుదురు. క్రైస్తవ్యము పేరున ఈ రోజుల్లో బోధింపబడేది చాలమట్టుకు బైబిలులో కనబడదు సరికదా క్రీస్తువారును, ఆయన అపొస్తలులును బోధించిన దానికి విరుద్ధముగా యున్నట్టిది.

మానవకల్పిత సిద్ధాంతములను బోధించుచున్న అబద్ధ ఆత్మలను బట్టి మనము పెడత్రోవను పెట్టబడుచూ యున్న యెడల మనకు శిక్ష విధించబడినప్పుడు నిందించుకొనవలసినది మనకు మనవే గాని వేరొకరిని కాదు. మనము ఆత్మలను పరిశోధించగలము.

క్రీస్తు ఒక కన్యకు జన్మించ లేదని బోధించే అబద్ధ ప్రవక్తలు అనేకులు లోకములోనికి బయలు వెళ్ళియున్నారు. క్రీస్తు గనుక ఒక కన్యకు జన్మించని యెడల యెషయా ఒక అబద్ధ ప్రవక్తయగును, ఏలయనగా కన్యక గర్భవతియై కుమారుని కని అతనికి ఇమ్మానుయేలను పేరు పెట్టును అని అతడు క్రీస్తు పుట్టక 700 సంవత్సరములకు ముందే ప్రవచించెను (యెషయా 7:14). అయితే క్రీస్తు కన్యయైన మరియకు జన్మించినట్లు మత్తయి వ్రాసెను (మత్తయి 1:22,23). క్రీస్తు ఒక కన్యకు జన్మించని యెడల బైబిలు అసత్య గ్రంధమగును. బైబిలు నమ్మదగిన



గ్రంధము కాని యెడల బైబిలు అసత్య గ్రంధమగును. బైబిలు నమ్మదగిన గ్రంధము కాని యెడల అది దేవుని వాక్యము కాక మానవ కల్పిత వేదాంతమగును. అట్టి సంగతులు సత్యమని మానవులలో కొందరు నమ్మినప్పుడు సాతానుడు బహు సంతోషించును. గనుక మనము వినుచున్న ప్రతి దానిని, అది సరియైనదో కాదో ఎంచిచూడవలెను.

క్రీస్తు యొక్క శరీర పునరుత్థానమును శంకించు అసత్యాత్మలు యిప్పుడు అనేకచోట్ల యున్నవి. ఈ అబద్ధ బోధకులు అనాత్మవాదులు. దేవుని శక్తి యొక్క జ్ఞానము వారికి లేదు; వారికి క్రైస్తవ్యము ఒక నైతిక తత్వము తప్ప వేరొకటికాదు. శ్రేష్టమైన నైతిక నియమము నిచ్చుటకు మాత్రమే క్రీస్తు రాలేదు. సువార్త ద్వారా నిత్య జీవము నిచ్చుటకు ఆయన వచ్చెను. “ ఆ క్రీస్తు యేసు, మరణమును నిరర్ధకము చేసి జీవమును అక్షయతను సువార్త వలన వెలుగు లోనికి తెచ్చెను” (2 తిమో 1:10). క్రీస్తు యొక్క పునరుత్థానము యధార్ధము కాని యెడల సువార్త ప్రకటన, క్రైస్తవుల నిరీక్షణ వ్యర్ధమేనని అపొ.పౌలు 1 కొరింధీ 15వ అధ్యాయములో చూపించుచున్నాడు. అయితే పునరుత్థానము యధార్ధమని పౌలు నమ్మెను. దాని నిమిత్తమైన నిరీక్షణ కొరకు చివరకు తన ప్రాణముల నర్పించెను (2 తిమో 4:6–8). బైబిలు బోధించు సత్యమును నిరాకరించు వారితో జ్ఞానము గల భక్తిపరులు సహవాసము కలిగియుండలేరు.

ఆత్మ యొక్క తత్వమును గూర్చి కూడ బోధించు వారి బోధను మనము పరిశోధింపవలసి యున్నది. ఆత్మ మర్త్యమైనదని బోధించే వారనేకులున్నారు. శరీరాత్మలు రెండు ఒకటే యనియు, ఒకటి మరొకటి లేకుండా యుండలేదనియు వారు బోధింతురు. దేవుడు మనుష్యునిలోనికి ఊదినది కేవలము గాలి తప్ప వేరొకటికాదని వారు చెప్పుచుందురు. అయితే మరణమైన తరువాత కూడ మానవుడు స్మృతి కలిగి యుండునని బైబిలు

బోధించు చున్నది. పౌలు తానొకసారి మూడవ ఆకాశమునకు కొనిపోబడెనని అతడెరుగునట్లును చెప్పెను (2 కొరింథీ 12:3,4). శరీరము లేకుండగనే ఒకడు స్మృతి కలిగి జీవించునని పౌలు యొక్క వృత్తాంతము నిరూపించుచున్నది. శరీరమును నాశనము చేయుటయ నగా ఆత్మను కూడ నాశనము చేయుట కాదని యేసు బోధించెను. “ఆత్మను చంపనేరక దేహమునే చంపు వారికి భయపడకుడి గాని, ఆత్మను దేహమును కూడ నరకములో నశింపజేయగల వానికి మిక్కిలి భయపడుడి” యని ఆయన హెచ్చరించెను (మత్తయి 10:28). సమాధి, నరకము రెండు ఒకటే యని కొందరు బోధింతురు. అయితే ఆ రెండు ఒకటే కాదని బైబిలు బోధించుచున్నది.

లూకా 16వ అధ్యాయములో ఒక ధనవంతుని గూర్చియు, బీదవాడైన లాజరును గూర్చియు జరిగిన సంఘట నను యేసు మనకొరకు వర్ణించెను. వీరిద్దరు జీవించిరి; అయితే వీరిద్దరు మరణించిన తరువాత లాజరు అబ్రహాము రొమ్మునను, ధనవంతుడు పాతాళములో బాధపడు చున్నట్లును యేసు చెప్పెను. నీతి మంతులకేమి, అవినీతిమంతులకేమి మరణము వారి స్మృతిగల ఉనికియొక్క అంతము కాదని ఈ సంఘటన నిరూపించుచున్నది. “మృతుల పునరుత్థానమును గూర్చి నేను అబ్రాహాము దేవుడను, ఇస్సాకు దేవుడను, యాకోబు దేవుడనై యున్నానని దేవుడు మీతో చెప్పిన మాట మీరు చదువలేదా?” అని యేసు సద్దూకయ్యులను ప్రశ్నించి “ఆయన సజీవులకే దేవుడు గాని మృతులకు దేవుడు కాదని వారితో చెప్పెను” (మత్తయి 22:31-33). అబ్రహాము, ఇస్సాకు, యాకోబులను వారు అప్పటికి చనిపోయి కొన్ని వందల సంవత్సరములైనను వారింకా సజీవులై యున్నారని యేసు బోధించెను. యేసు బోధను విని జనులు ఆశ్చర్యపోయిరి. సద్దూకయ్యులు ఓడిపోయిరి. నేడు కూడా మానవుని ఆత్మీయ స్థితిని శంకించు వారిని, వారి బోధను నిజ క్రైస్తవులు దేవుని వాక్యమును బట్టి



పరిశోధించవలెను.

ప్రతిచోట వింతయైన సిద్ధాంతములు బోధింపబడుటను మనము చూచుచునే యున్నాము. పరలోకము నుండి ఏదో ఒక క్రొత్త సంగతిని దేవుడు వారికి బయలు పరచెనని చెప్పుకొనువారి సంఖ్య రోజు రోజుకు పెరుగుచునే యున్నది. దేవుని యొక్క అంతిమ బయల్పాటగు బైబిలుతో మానవుడు సంతృప్తిజెంద లేడు. దేవుని సత్య సంగతులను మార్చివేయుటకు అపవాది అనేక తంత్రములను వేయునను సంగతి మన మెరిగినదే.

క్రైస్తవునికి, నిజానికి మానవునికి దేవుడిచ్చిన సంపూర్ణ మార్గదర్శి బైబిలు. బైబిలులో యున్న దానిని తప్ప వేరొక దానిని మానవుడు బోధించరాదు. “దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతిలేఖనము ఉపదేశిం చుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్ష చేయు టకును ప్రయోజనకరమై యున్నది”. సత్యవాక్యమును ప్రకటించుటలోను, లిఖించుటలోను, పరిశుద్ధాత్ముడు అపొస్తలులకు అప్పగింపబడెను (యూదా 1:3). క్రీస్తు యొక్క అపొస్తలులు బోధించిన సువార్త తప్ప వేరొక దానిని మానవులు గాని, దేవ దూతలుగాని ప్రకటింపవీలులేదు (గలతీ 1:8,9). లేఖనములకు ఎవడైన దేనినయినా కలిపిన యెడల లేక తీసి వేసిన యెడల దేవుని శాపము అతని పై నిలుచును (ప్రకటన 22:18,19). అజాగ్రత్తపరులు, అబద్ధబోధకులు ఈ హెచ్చరికలను గైకొనరు గాని దైవభీతి గలవారు వాటిని మన్నింతురు.

అనేకులు భక్తిపరులుగా యుండగోరుదురుగాని లేఖనములలో కనబడు క్రీస్తు బోధను అంగీకరించ లేరు. వారు హితబోధను సహించలేరు గనుక వారి కిష్టమైన బోధను బోధించు అబద్ధ బోధకులను తమ కొరకు పోగుచేసికొందురు (2 తిమో 3:1-9).

మనము ప్రతి ఆత్మను లేక బోధను పరిశోధించవలెను. అవి బైబిలుతో సంపూర్ణ సమైక్యత కలిగి యుండని యెడల వాటిని అబద్ధ బోధలని గుర్తించి తిరస్కరించవలెను.

ఒకడు క్రీస్తు సంఘసభ్యుడు కాకుండగనే రక్షింపబడగలడను భావమును అపవాది ప్రజలలో కల్పించుచున్నది. క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నాడు ఈలోక ప్రజలను రక్షించి, వారికి సేవ చేయు నిమిత్తము క్రీస్తు సంఘమును స్థాపించెను. శిరస్సు లేకుండా శరీరమైన సంఘము ఉండలేదు. సంఘము క్రీస్తు కలసి యుండవలెను. సంఘమునకు రక్షకుడు క్రీస్తు. మరియు రక్షింపబడిన ప్రతివారిని ప్రభువే తన సంఘముతో చేర్చును. క్రీస్తు ఒకే ఒక్క సంఘమును స్థాపించెను. మతశాఖలు ఆయన స్థాపించిన సంఘములు కావు. వాటికి రక్షకుడు క్రీస్తుకాదు. వారు కొంతమట్టుకు బైబిలును బోధించినను, చాల మట్టుకు మానవ కల్పిత సిద్ధాంతములనే బోధింతురు. అందువలననే మనము ప్రతి ఆత్మను నమ్మక అనగా ప్రతి బోధను నమ్మక ఆయా బోధలు దేవుని సంబంధమైనవో కావో పరీక్షించవలెనని హెచ్చరింపబడి యున్నాము. వాటిని పరీక్షించు నిమిత్తము ప్రభువు తన గ్రంథమును మనకిచ్చియున్నారు. గనుక మనము పొరబడనవసరము లేదు.

నీవు అసత్య మార్గములోనికి నడిపించబడి యుండిన యెడల దాని నుండి ఈనాడే వైదొలగుము. క్రీస్తునందు సంపూర్ణ విశ్వాసముంచుము, నీ పాపముల విషయమై మారుమనస్సు నొందుము. నీ విశ్వాసమును మనుష్యుల యెదుట ఒప్పుకొని పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. ప్రభువు నిన్ను రక్షించి రక్షించబడినవారున్న తన సంఘముతో చేర్చును. ఈ విషయములో నీవు ఇంకా ఎందుకు ఆలస్యము చేయవలెను?



# యేసు గొప్పవాడు

మానవజాతి అనేక గొప్ప సంగతులను సాధించినది. ఐగుప్తులో పిరమిడ్లు, టెలిఫోన్, టెలివిజన్, ఇంటర్నెట్ చంద్రయానం వగయిరాలు కొన్ని ఉదాహరణలు. ఇటువంటివి ఎన్నో ఎన్నో గొప్ప సంగతులు మానవ జాతి సాధించినది. అయితే మానవ జాతి అంతటికి గొప్పగా నిలిచే ఒకే ఒక వ్యక్తి ఉన్నారు. ఆయనే యేసు క్రీస్తు. ఆయన ఎందుకు గొప్పవాడో కొన్ని సంగతులు గమనించుదాం.

**యేసు దేవాలయము కంటే గొప్పవాడు :** పరిశుద్ధ పట్టణమైన యెరూషలేములో యున్న దేవాలయము అతి పరిశుద్ధమైనదని యూదులు భావించేవారు. కానాను వారికి అది పరిశుద్ధమైన ప్రదేశము. అయినను మన ప్రభువు తన్ను గూర్చి చెబుతు ఇదిగో "దేవాలయము కంటె గొప్ప వాడిక్కడ ఉన్నాడని" యూదులకు తెలియజేసారు (మత్తయి 12:6).

**యేసు యోనాకంటే గొప్పవాడు:** యోనా దేవుని ప్రవక్త. అతని యొక్క ప్రకటనవలన నీనెవె పట్టణమంతా మారుమనస్సు పొందారు, యెహోవా తట్టుతిరిగారు. "నీనెవెవారు యోనా యొక్క ప్రకటన విని మారుమనస్సు పొందిరి గనుక విమర్శసమయమున నీనెవెవారు ఈ తరమువారితో నిలువబడి వారి మీద నేరస్థాపన చేయుదురు. ఇదిగో యోనా కంటే గొప్పవాడిక్కడ ఉన్నాడు" (మత్తయి 12:41) అని ఆయన చెప్పెను.

**యేసు సొలొమోను కంటె గొప్పవాడు :** సొలొమోను తనకున్న జ్ఞానమును బట్టి, ఐశ్వర్యము, ఘనతను బట్టి, తాను నిర్మించిన దేవాలయమును బట్టి ఘనుడుగా ఎంచబడే వాడు. అయినను అతడు క్రీస్తు దగ్గర ఎందుకు పనికిరాడు. యేసు ఇట్లు చెప్పారు :

